రామిడి స్వప్నకు మహిళా సేవ అవార్డు


అవార్డు అందుకున్న స్వప్న విజయ్‌రెడ్డి

కీసర: ఆదివారం నగరంలోని హరిహర కళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో కీసర మాజీ వార్డు సభ్యురాలు, కాంగ్రెస్ మహిళా నేత రామిడి స్వప్నవిజయ్‌రెడ్డికి మహిళా సేవ వైభవ అవార్డు అందుకున్నారు. సర్ సీవీ రామన్ అకాడమీ(సేవా సాంస్కృతిక సంస్థ) రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. సీవీ రామన్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మహేంద్ర వాడ వెంకటేశ్వరరావు, శ్రీకృష్ణ సేవా సంస్థాన్ అధ్యక్షుడు శ్రీకృష్ణ, చాముండేశ్వర మహర్షి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరిలో శివసేన పోటీ చేస్తుంది


సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

మేడ్చల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి స్థానం నుంచి తమ పార్టీ పోటీ చేస్తుందని శివసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ అన్నారు. మేడ్చల్‌లో ఆదివారం నిర్వహించిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో ఆయన పాల్గొని జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు జగదీష్, నాగభూషన్, సుమన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు ఆర్థిక సాయం



ఘట్‌కేసర్: మక్త అనంతారం గ్రామానికి చెందిన స్వప్న, ఆమె భర్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి ఇద్దరు కుమార్తెలు అనాథలయ్యారు. దీంతో స్వప్న బాల్య స్నేహితులు చిన్నారుల పేరు మీద రూ.50 వేలు బ్యాంక్‌లో డిపాజిట్ చేసి ఆదివారం బాండ్ అందజేశారు. కాగా, స్వప్న ఎదులాబాద్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–05లో పదో తరగతి చదివారు.

సత్యసాయి కాలనీ అధ్యక్షుడిగా కృష్ణాగౌడ్


ధ్రువీకరణ పత్రాన్ని కృష్ణాగౌడ్‌కు అందజేస్తున్న సభ్యులు

పోచారం: అన్నోజిగూడ సత్యసాయి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి పదవులకు ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన కోన మల్లేశ్‌పై 39 ఓట్ల ఆధిక్యంతో ఎన్.కృష్ణాగౌడ్ విజయం సాధించారు. కార్యదర్శిగా బరిలో నిలిచిన కె.చంద్రశేఖర్‌పై అశోక్ చక్రవర్తి 34 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల ప్రక్రియను ఎలక్షన్ కమిటీ సభ్యులు ప్రసాద్, మదనయ్య, మల్లేశ్, వేణు నిర్వహించి అధ్యక్ష, కార్యదర్శులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ఘట్‌కేసర్ సీఐగా సైదులు



ఘట్‌కేసర్: స్థానిక పోలీస్ స్టేషన్ సీఐగా ఎస్.సైదులు ఆదివారం బాధ్యత స్వీకరించారు. నగరంలోని మధురానగర్ పీఎస్ నుంచి ఇక్కడకు బదిలీ కాగా ఇక్కడ సీఐగా పనిచేసిన గోవర్ధనగిరి మాసబ్‌ట్యాంక్ పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతలు కాపాడటంలో ముందుంటామన్నారు.

ఈటలను కలిసిన బీజేపీ నాయకులు



మేడ్చల్: మల్కాజ్‌గిరి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్‌ను ఖరారు చేయడంతో మేడ్చల్ నియోజకవర్గ నాయకులు మోహన్‌రెడ్డి, బుద్ది శ్రీనివాస్, కృష్ణగౌడ్, జగన్‌గౌడ్, పలు మున్సిపాలిటీల నాయకులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వినాయక మండపానికి విరాళం



శామీర్‌పేట్: మండలంలోని మజీద్‌పూర్ గ్రామం ఇందిరమ్మ కాలనీలో శాశ్వత వినాయక మండపం నిర్మాణం కోసం స్థానికుడు తుంకి రమేశ్ విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం కాలనీలోని ఉత్సవ కమిటీ సభ్యులకు రూ.1 లక్ష నగదు అందజేశారు. కార్యక్రమంలో వీరయ్యగౌడ్, వెంకటేశ్, శ్రీకాంత్‌గౌడ్, వినోద్‌గౌడ్, గండిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు యువకుడు మృతి

జవహర్‌నగర్: ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. దమ్మాయిగూడలో తేజావత్ భద్రు, భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో ఉంటున్నారు. భద్రు కుమారుడు తేజావత్ లక్ష్మణ్(20) పదో తరగతి వరకు చదువుకొని తండ్రితో పాటు కూలి పనులకు వెళ్తున్నాడు. అయితే, మద్యానికి అలవాటు పడిన లక్ష్మణ్ ఆదివారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకెళ్లి తిరిగిరాలేదు. దీంతో అతని ఆచూకీ కోసం వెతికినా లభించలేదు. కాగా, దమ్మాయిగూడ చెరువు సమీపంలో లక్ష్మణ్ ద్విచక్ర వాహనం ఉందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లారు. చెరువు పరిసరాల్లో పరిశీలించడంగా ఒక గుంతలో లక్ష్మణ్ శవమై కనిపించాడు. ఇదిలా ఉండగా, లక్ష్మణ్ ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి మృతి చెందాడా లేక ఆత్మహత్య అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

60 లక్షల మొక్కలు

- పదో విడత హరితహారంపై అధికారుల చర్యలు
- ఆర్థిక వనరులు చేకూర్చే జాతులపై ప్రత్యేక దృష్టి
- 74 నర్సరీల్లో 63.20 లక్షల మొక్కల పెంపకం



సాక్షి, మేడ్చల్ జిల్లా: పదో విడత హరితహారంలో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 60 లక్షల మొక్కలు నాటేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు 61 గ్రామ పంచాయతీలు, 13 పురపాలక సంఘాల్లో 74 ప్రాంతాల్లో ఉన్న నర్సరీల్లో 63.20 లక్షల మొక్కలు ఉత్పత్తి అయ్యేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. 61 గ్రామ పంచాయతీల్లోని నర్సరీలను గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహిస్తుండగా.. మిగతా ప్రాంతాల్లోని నర్సరీలను అటవీ శాఖ, పురపాలక సంఘాలు పర్యవేక్షిస్తున్నాయి. నర్సరీల్లో మొక్కల పెంపకానికి అవసరమైన ఎర్రమట్టిని గ్రామాలు, పట్టణాల నుంచి తరలిస్తున్నారు.

ఔషధ మొక్కలకు ప్రాధాన్యం

ఎవరికి ఏ మొక్కలు కావాలో గ్రామాలు, పురపాలికల్లో సర్వే చేయాలని అధికారులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు సూచించారు. వాటితో పాటు ఔషధ మొక్కలు, రోడ్ల వెంట నాటేందుకు భారీ వృక్షాలకు సంబంధించిన మొక్కలు నర్సరీల్లో పెంచుతున్నారు. ఇప్పటికే తొమ్మిది విడతలుగా ఇంటింటికి పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. రహదారికి ఇరువైపులా నాటేందుకు అవసరమైన మొక్కలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇళ్లలో పెంచుకునేందుకు జామ, నిమ్మ, తులసిలాంటి ఔషధ మొక్కలు అందించాలని నిర్ణయించారు. వీటితో పాటు అల్ల నేరేడు, చింత, వేపతో పాటు వివిధ రకాల పూల మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉపాధి హామీ నిధులతో..

ఉపాధి హామీ నిధులతో వచ్చే ఏడాది జూన్ నుంచి చేపట్టనున్న హరితహారానికి ఇప్పటి నుంచే అధికారులు కసరత్తు చేయడం విశేషం. ఇందుకు అవసరమైన మొక్కలు పెంచేందుకు నర్సరీల్లో పనులు ముమ్మరం చేశారు. నర్సరీల్లో మిగిలిన మొక్కలను సంరక్షిస్తూనే.. కొత్తగా మొక్కలపై దృష్టి సారిస్తున్నారు. హరితహారం ద్వారా మొక్కలు నాటేందుకు నర్సరీలు ఏర్పాటు చేసిన అధికారులు గత ఏడాది డిసెంబర్‌లోనే సంచుల్లో మట్టిని నింపి విత్తనాలు నాటారు. చలికాలంలో విత్తనాలు నాటితే పెరుగుదల నాణ్యంగా ఉంటుందని భావించిన యంత్రాంగం ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంది. గ్రామస్తులు, పట్టణ వాసులకు అవసరమైన మొక్కల కోసం సర్వే చేసి తదనుగుణంగా నర్సరీలు ఏర్పాటు చేశారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


కార్యక్రమంలో పాల్గొన్న హరివర్ధన్‌రెడ్డి

కీసర: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని ఆర్‌జీకే కాలనీలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జ్ఞానమాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరివర్ధన్ రెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి 100వ వారం జ్ఞాన మాల సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప రామారావు, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఈగ శ్వేత, నేతలు ఏనుగు సంజీవరెడ్డి, వరగంటి వెంకటేశ్, గడ్డం శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు శోభారాణి, సుమేశ్, శైలజా శ్రీనివాస్, నర్మద పరశురామ్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం



కీసర: కీసరగుట్ట గురుకుల పాఠశాలలో 1998–1999 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులను, ప్రస్తుత పాఠశాల సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలకు టేబుల్స్, చైర్స్‌తో పాటు పాఠశాలలో చదువుతున్న 600 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అంజన్నరెడ్డి, కె.నాగేశ్వరరావు, పి.నర్సింహాచారి, మురళీధర్, సీవీవీ ప్రసాద్, భీష్మాచారి, లక్ష్మణాచారి, శివరామిరెడ్డి, సుబ్బారావు, వసంత, ఛాయా మేడం, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సూర్య ఎన్‌క్లేవ్‌లో నిర్మిస్తున్న శ్రీ కంఠ మహేశ్వర స్వామి, శ్రీ రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఆదివారం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గూడూరు సబితా ఆంజనేయులుగౌడ్, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు తేళ్ల శ్రీధర్, మహేశ్ గౌడ్, చక్రపాణి గౌడ్, సాయినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనురాగ్ వర్సిటీలో 'వినియోగదారుడా మేలుకో...'


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం 'వినియోగదారుడా మేలుకో' సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి వస్తువులు కొనుగోలు, సేవల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యాపార ప్రకటన ద్వారా ఏ విధంగా పక్కదారి పట్టిస్తారో వివరించారు. వినియోగదారుడు నష్టపోతే కంపెనీపై ఏ విధంగా చర్యలు తీసుకోవచ్చో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంబీఏ, బీబీఏ విద్యార్థులు, అధ్యాపకులు, యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీలో కలపాలి


మాట్లాడుతున్న బాలరాజ్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: వడ్డెరలను ఎస్టీలో కలపాలని వడ్డెర యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజ్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలరాజ్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ కృషితో ప్రతి ఒక్కరికి ఓటు హక్కు లభించిందన్నారు. కార్యక్రమంలో దాసు, రామోజీ, ఆంజనేయులు గౌడ్, విజయకుమార్, ముత్యాలు, వెంకటేశ్, రమేశ్, నర్సింగ్‌రావు, రాజేశ్, రామారావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



చెక్ అందజేస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

ఘట్‌కేసర్: అనారోగ్యంతో బాధపడుతున్న యాదాద్రి భువనగిరి జిల్లా మక్త అనంతారానికి చెందిన కవిత కుటుంబ సభ్యులకు సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పేదరికం కారణంగా బాధితులు చికిత్స చేయించలేక సాయం కోసం విన్నవించారు. దీంతో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో బాధితులకు చెక్ అందజేశారు. ట్రస్ట్ కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు సోమయ్య, దేవేందర్, ఐలయ్య, బాబు, సాంబశివరావు, మల్లికార్జున్‌రావు, కృష్ణ, బలమ్మ పాల్గొన్నారు.

బిట్స్ పిలానీలో హెల్త్ క్యాంప్



జవహర్‌నగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం బిట్స్ పిలానీ క్యాంపస్‌లో కాస్మిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్ అండ్ నేచురోపతి(సీఐఏఎన్) ద్వారా సెల్ఫ్ హీలింగ్ హెల్త్ క్యాంప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐఏఎన్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. ఆక్యుపంక్చర్ అతి పురాతన భారతీయ వైద్య చికిత్స అన్నారు. కార్యక్రమంలో డీన్ యోగేశ్వరి, వైద్యులు హారిక, భవానీకుమార్, సంతోశ్, కవిత, శివరాజని, హరిధర్, సబిత, విజయలక్ష్మి, వీణ, సత్యనారాయణ, రఘునాథ్, ఆర్‌కెఎస్‌సీ కో–ఆర్డినేటర్ అర్చన, చీఫ్ కో–ఆర్డినేటర్ సావిత్రి, ఫోరం సభ్యులు సూర్య, నికత్, రాధిక పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



జవహర్‌నగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గత నెల 25వ తేదీన కాప్రా జమ్మిగడ్డ సాకేత్ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారస్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. బాధితుడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడికి పోస్టుమార్టం చేసి గాంధీ మార్చురీలో ఉంచినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు ఫోన్: 87126 62188, 87126 62097లలో సంప్రదించవచ్చు.

చుక్క..ఆరోగ్యం ఎంచక్కా


డబీల్‌పూర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ రజితరెడ్డి


గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో.. చైర్‌పర్సన్ లక్ష్మి


దమ్మాయిగూడలో.. మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్

ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి 5 సంవత్సరాల లోపు వారికి పోలియో చుక్కలు వేసేందుకు తల్లిదండ్రులు ఆరోగ్య కేంద్రాలకు క్యూ కట్టారు. వైద్య శాఖ అధికారులు గ్రామాలు, పట్టణాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, ఇతర ఆస్పత్రుల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు.

– మేడ్చల్/మేడ్చల్‌రూరల్/కీసర/ జవహర్‌నగర్/పోచారం/ఘట్‌కేసర్


జవహర్‌నగర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి


పోచారం సంస్కృతి టౌన్‌షిప్‌లో..


నాగారంలో.. మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు


జవహర్‌నగర్‌లో.. పోలియో చుక్కలు వేస్తున్న మేయర్ కావ్య


ఘట్‌కేసర్‌లో చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్ శశికళ


శామీర్‌పేటలో...

ధరణిలో కదలిక..

- నేటి నుంచి వేగవంతంగా ధరణి ప్రక్రియ
- దరఖాస్తులు పరిశీలిస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- జిల్లాలో 10 వేల దరఖాస్తులు నమోదు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ధరణి వినతుల పరిష్కార ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా జోరుగా కొనసాగుతోంది. సీసీఎల్ఏ నుంచి ఆర్డీఓ, తహశీల్దార్ కార్యాలయాలకు బదిలీ అయిన దరఖాస్తులను స్థానిక రెవెన్యూ యంత్రాంగం పరిశీలన చేపట్టింది. కార్యాలయ స్థాయిలో పరిశీలన చేసి వాటిని క్షేత్రస్థాయిలో విచారించనున్నారు. అనంతరం సమగ్ర నివేదికను ఆర్డీఓ, కలెక్టర్‌కు అందజేయనున్నారు. జిల్లాల్లో ధరణి దరఖాస్తుల పరిష్కారానికి 21 ప్రత్యేక బృందాలను ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు.

- గ్రామస్థాయిలో భూముల వివాద పరిష్కారాల్లో చురుగ్గా ఉండే వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ రద్దు కావడంతో క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన మండల ప్రత్యేక బృందాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు కొన్ని తహశీల్దార్ కార్యాలయాలకు దరఖాస్తుల పంపిణీలో జాప్యం నెలకొన్నాయి. రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఇటీవల కొంత మంది అధికారులు బదిలీ కావడంతో ఇక్కడ కూడా కొంత అయోమయం నెలకొంది. ఈ నెల 9 వరకు ఈ ప్రత్యేక కార్యక్రమం కొనసాగనుండగా.. నేటి నుంచి ఈ ప్రక్రియలో మరింత వేగం పుంజుకుంటుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

రెండు నెలల్లో 1,025 అప్లికేషన్లు

- జిల్లాల్లో గతేడాది డిసెంబరు ఆఖరు నాటికి తొమ్మిది వేలకు పైగా ఫిర్యాదులు నమోదు కాగా.. జనవరి, ఫిబ్రవరిల్లో మరో 1,025 పైగా దరఖాస్తులు వచ్చాయని తెలిసింది. వీటిని తొలుత క్షేత్రస్థాయిలో పరిశీలించి తహశీల్దార్, ఆర్డీఓ నివేదికల ద్వారా కలెక్టర్ దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. పట్టాదారు పాసు పుస్తకాల్లో పేర్లు, ఆధార్ నంబరు, ఫోన్ నంబర్ల మార్పు తదితర వాటిని తహశీల్దార్ పరిధిలోనే పరిష్కారం లభించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే, తహశీల్దార్లకు లాగిన్ అప్పగించడంలో కొంత జాప్యం నెలకొంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అందుబాటులో లేని రికార్డులు..

- జిల్లాలోని పలు మండలాల్లో వివాదంలో ఉన్న రెవెన్యూ, ఇతర భూములపై కూడా దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించే క్రమంలో పాత రికార్డులను పరిశీలించగా.. కొన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో ఆయా రికార్డులు అందుబాటులో లేవని తెలుస్తోంది. ఇలాంటి దరఖాస్తులను ఉన్నతాధికారులకు నివేదించారు. ఒకటి, రెండు రోజుల్లో వీటిపై ఆదేశాలు రానున్నాయి. కొన్ని చోట్ల మాన్యువల్ పహణీలు అందుబాటులో లేకపోవడంతో ప్రత్యేక బృందాలకు దరఖాస్తుల పరిష్కారంలో ఇక్కట్లు ఎదురవుతున్నట్టు సమాచారం. తొలి దశలో దరఖాస్తులు పరిశీలించి క్షేత్రస్థాయి విచారణ చేసిన అనంతరం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశంతో వాటిని పరిష్కరించేలా కసరత్తు చేయనున్నారు.